
ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 సంచిక - 185 ఆదివారం 5 ఏప్రిల్ 2026 పేజీలు - 6 వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




## అమరావతి చరిత్రలో అందరూ
# భాగస్వామ్యులే



**అమరావతి నిర్మాణంలో జాప్యం సహించను... చకచకా పనులు సాగి తీరాల్సిందే**

**అధికారులు, కాంట్రాక్ట్ సంస్థలకు ఆదేశం..నిర్మాణ పనులపై సమీక్షలో సీఎం చంద్రబాబు**

**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

రాజధాని అమరావతి పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్ట్ సంస్థల తీరుపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణాలు పూర్తి చేసి తీరాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. రాజధాని నిర్మాణ పనులపై సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిర్మాణాలు చేస్తున్న కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, పలువురు అధికారులపై ఆయన సీరియస్ అయ్యారు. అలాగే రాజధాని అమరావతి నిర్మాణ ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపైనా సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా నిర్మాణ సంస్థల తీరును తప్పుపట్టారు. నిర్మాణ సామగ్రికి రక్షణ కల్పించే బాధ్యత కాంట్రాక్ట్ సంస్థలకు లేదా? అంటూ ఆయన ప్రశ్నించారు. కాంట్రాక్ట్ సంస్థల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఘటన తర్వాత కూడా కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులు సరిగా స్పందించలేదని మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఇసుక, గ్రావెల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆజ్ఞాపించారు. ఇసుక, గ్రావెల్ కొరతతో నిర్మాణ పనుల్లో జాప్యం జరగకూడదని సీఎం చంద్రబాబు చెప్పారు. అయితే, కృష్ణాజిల్లా అటవీ శాఖ అధికారుల వల్లే గ్రావెల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ముఖ్యమంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అటవీ అధికారులతోనే అసలు సమస్య వస్తోందన్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అటవీశాఖ అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధానికి అవసరమైన ఇసుక, గ్రావెల్ గ్రీన్ ఛానెల్ ద్వారా వెళ్లాలని ఆదేశించారు. మెటీరియల్ సరఫరాలో ఎవరి ఒత్తిళ్లకూ లొంగొద్దని హుకుం జారీ చేశారు. ఎవరైనా ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ వక్రీకరించేలా కొందరు రాజకీయాలు చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలి కదా? అంటూ సున్నితంగా హెచ్చరించారు. రగరాని ఘటనలు జరిగితే వెంటనే అలర్ట్ చేయాల్సిన బాధ్యత లేదా? అంటూ కాంట్రాక్ట్ సంస్థలను చంద్రబాబు ప్రశ్నించారు. ప్రభుత్వంపై బురద జల్లేందుకు కొందరు సిద్ధంగా ఉన్నారన్నారు. నిర్మాణ సంస్థలు సమర్థులైన ప్రాజెక్ట్ మేనేజర్లను నియమించుకోవాలన్నారు. అలా చేయకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు సీఎం. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించమని సీఎం చంద్రబాబు వారికి తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాజధాని 2లో

## మోదీపై కెనడా ప్రధాని
# ప్రశంసలు



**సెలవుల్లేకుండా 25 ఏళ్ల సేవకు గుర్తింపు..**

**ప్రజలతో అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ..**

**సిడ్నీ(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

సిడ్నీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ ఎంతో ప్రత్యేకమైన నాయకుడని పేర్కొంటూ, ఆయన నిబద్ధత అసాధారణమని కొనియాడారు. ఇటీవల భారత పర్యటనలో మోదీతో జరిగిన భేటీని గుర్తు చేసుకున్నారు.గత పావు శతాబ్దంగా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశ సేవలో నిమగ్నమై ఉండటం గొప్ప విషయమని కార్నీ అభిప్రాయపడ్డారు. ప్రతి వారాంతంలో 2లో



## ట్రంప్ నియంత్రణలో
# ప్రధాని మోదీ

**అమెరికా అధ్యక్షుడిపై ఆధారపడుతున్నారనే ఆరోపణ..**

**'సర్' అంటూ సంభోదనపై విమర్శించిన రాహుల్‌గాంధీ..**

**ఇడుక్కి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రణలో మోదీ ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆరోపించారు. ట్రంప్‌ను 'సర్' అంటూ సంభోదించడం దేశానికి అవమానకరమని వ్యాఖ్యానించారు. మోదీ ఇంకా బ్రిటిష్ కాలపు ఆలోచనలతోనే ఉన్నారని విమర్శించారు.మోదీని ట్రంప్ నియంత్రిస్తున్నట్టే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కూడా మోదీ 2లో

## అమరావతిపై అనేక
# సందేహాలు



**లోక్‌సభ ఆమోదంతో సమస్య పూర్తికాలేదు...**

**భవిష్యత్‌లో న్యాయపరమైన సవాళ్లకు అవకాశం..**

**ప్రజాభిప్రాయం లేకుండా తీసుకున్న నిర్ణయం..**

**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

అమరావతిని రాజధానిగా ప్రకటించడం రాజకీయంగా పరిష్కారమైన అంశమే గానీ చట్టపరంగా ఇంకా అనేక సందేహాలు మిగిలే ఉన్నాయని వైఎస్ఆర్సీపీకి చెందిన మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు.లోక్‌సభలో చట్టబద్ధత కల్పించినప్పటికీ ఈ సమస్య పూర్తిగా ముగిసినట్టుకాదని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో కోర్టుల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే న్యాయపరమైన అంశాలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్రానికే చెందుతుందని, గతంలో కేంద్రం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు గుర్తు చేశారు. రాజ్యాంగంలోని పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన 2లో



## త్రిభాషా విధానంపై
# ఆగ్రహం

**ఇది హిందీని రుద్దే కార్యక్రమంగా ఉంది..**

**తమిళనాడు సిఎం స్టాలిన్ అభ్యంతరం**

**చెన్నై (తెలుగోడు),ఏప్రిల్ 4 :**

2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుండి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు సిబిఎస్ఇ తాజాగా ప్రకటించింది. త్రిభాషా విధానంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ప్రాంతీయ భాషల కంటే హిందీకి ఎక్కువ ప్రాధాన్యత నివ్వడానికి, ఆ భాషను బలవంతంగా రుద్దడానికి చేసే ప్రయత్నమేనని ఆయన మండి పడ్డారు. ఈ విధానం సమాఖ్యవాదాన్ని దెబ్బ తీస్తుందని, హిందీ మాట్లాడని రాష్ట్రాలను అణచివేస్తుంది. పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులపై అనవసర భారాన్ని మోపుతుందని స్టాలిన్ ఆరోపించారు. భారతదేశ భాషా వైవిధ్యాన్ని గౌరవించాలని, రాష్ట్రాలవ్యాప్తంగా విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని స్టాలిన్ కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'జాతీయ విద్యా విధానం 2020కి (మిగతా 2లో)

## అమరావతి పేరుతో
# కూటమి దోపిడీ



**అప్పుల ద్వారా ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారన్న ఆరోపణలు..**

**అమరావతికి కుల ముద్ర వేయడానికి ప్రయత్నాలంటూ సజ్జల విమర్శలు..**

**తాడేపల్లి (తెలుగోడు),ఏప్రిల్ 4 :**

ప్రజలను మభ్యపెట్టే విధంగా పదేపదే ఒకే విధమైన అసత్యాలను ప్రచారం చేస్తున్నారని సజ్జల రామక్రిష్ణారెడ్డి ఆరోపించారు. వికేంద్రీకరణ విధానాన్ని మూడు ముక్కలాటగా ఎగతాళి చేయడం సరికాదని పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం రాష్ట్రానికి భారంగా మారకుండా ఉండాలన్న దృష్టితోనే ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు.రాజధాని ప్రాంతంలో గతంలో భారీ స్థాయిలో దోపిడీ, అవినీతి జరిగిందని ఆరోపించారు. అనవసరంగా అధిక రేట్లు నిర్ణయించి కాంట్రాక్టులు ఇచ్చి ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశారని విమర్శించారు. అవకాశమొస్తే ఏ విధంగానైనా లాభాలు పొందే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. 2లో

## అమెరికా యుద్ధ విమానాలను
# కూల్చిన ఇరాన్

**హోర్ముజ్ సముద్రసంధి వద్ద ఘర్షణలు తీవ్రం**


**రెండు ఫైటర్ జెట్లను నేలకూల్చినట్టు ఇరాన్ ప్రకటన**



**టెహ్రాన్ (తెలుగోడు),ఏప్రిల్ 4 :**

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధ వాతావరణం రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోంది. పరిస్థితి చల్లారే సూచనలు కనిపించకపోగా, పరస్పర దాడులు మరింత ఉధృతమవుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా కలిసి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ప్రయత్నాలు 2లో

## మాచర్ల ఘటనపై మహిళా కమీషన్
# సీరియస్



**నిందితుడి అరెస్టుకు ఆదేశాలు..**

**మహిళల భద్రతపై కఠిన హెచ్చరికలు..**

**బాధితురాలిని పరామర్శించిన రాయపాటి శైలజ...**

**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై జరిగిన అత్యాచారం ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బాధిత మహిళను రాయపాటి శైలజ ఫోన్‌లో పరామర్శించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి అన్ని విధాలా సహాయం అందించేందుకు మహిళా కమిషన, ప్రభుత్వం అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని రాయపాటి శైలజ స్పష్టం చేశారు. 2లో

## పదో తరగతి విద్యార్థులకు
# అదనపు మార్కులు

**హిందీకి 2, ఇంగ్లీష్‌కు 5 మార్కులు**

**మూడు ప్రశ్నల్లో అస్పష్టత గుర్తింపు**



**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి విద్యార్థులకు ఎస్-ఎస్‌సీ బోర్డు గుడ్ న్యూస్ తెలిపింది. పరీక్షల్లో సందిగ్ధంగా ఉన్న ప్రశ్నల కారణంగా విద్యార్థులు నష్టపోకుండా అదనపు మార్కులు ఇవ్వాలని నిర్ణయించింది. పరీక్షలు రాసిన విద్యార్థుల తుది ఫలితాల్లో మొత్తం 7 మార్కులు కలపాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ 2లో

## ఒంటిమిట్టలో కోదండ రామునికి
# నేత్రపర్వంగా చక్రస్నానం

**భారీ సంఖ్యలో పుణ్య స్నానాల్లో పాల్గొన్న భక్తాదులు**



**ఒంటిమిట్ట (తెలుగోడు),ఏప్రిల్ 4 :**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు. 2లో

## విద్యార్థులకు మెరుగైన భోజనం
# ఇస్తున్నాం




**స్కూల్‌లో మధ్యాహ్న భోజనంపై ఆకస్మిక తనిఖీ..**

**సన్న బియ్యంతో పౌష్టికాహారం అందిస్తున్నామన్న మంత్రి..**

**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

పెనమలూరు ప్రాంతంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గతంలో లావు బియ్యంతో భోజనం వడ్డించేవారని, ప్రస్తుతం సన్న బియ్యంతో మంచి భోజనం అందుతున్నదని విద్యార్థులు తెలిపారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. 2లో

## అమరావతిపై తీర్మానం
# శాశ్వతం కాదు



**సకాలంలో పూర్తి చేయకపోతే ఆలోచిస్తాం**


**బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు**

**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అమరావతి రాజధాని అంశంపై మరోసారి చర్చనీయాంశంగా మారేలా వైసీపీ నేత బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై తీర్మానం చేసినంత మాత్రాన అది శాశ్వతం కాదని, అసలు నిర్మాణం పూర్తి కావడం ద్వారానే రాజధాని స్థిరపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని, ఆ పేరుతో జరిగే అవినీతికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. అమరావతి మాకు ప్రయారిటీ కాదు. అది మాకు శాసన రాజధాని మాత్రమే. అలాంటప్పుడు మేమెందుకు రూ.లక్షా పదివేల కోట్లు ఖర్చు చేస్తాం? అమరావతి పనులు వేగంగా పూర్తి చేయాలి. సీఎం చంద్రబాబు అమరావతిని జాప్యం చేస్తే మేం ఇంకో ఆలోచన చేస్తాం అని బొత్స అన్నారు.రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, అమరావతి అంశం చుట్టూనే ప్రభుత్వం, మీడియా తిరుగుతోందని బొత్స విమర్శించారు. ప్రజల అసలు సమస్యలను పక్కన పెట్టి ఒకే అంశంపై దృష్టి సారించడం దురదృష్టకరమని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, మామిడి పండ్లలో కూడా కల్తీ జరుగుతోందని ఆయన ఆవేదన 2లో

## 28 జిల్లాలతో కొత్తగా
# ఎపి మ్యాప్ విడుదల

**అమరావతి ప్రాంతానికి ప్రత్యేకంగా గుర్తింపు**



**అమరావతి(తెలుగోడు),ఏప్రిల్ 4 :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్ర నూతన మ్యాప్‌ను విపత్తు నిర్వహణ శాఖ విడుదల చేసింది. మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ అధికారిక మ్యాప్‌ను ఈ నెల 2వ తేదీన ప్రచురించారు. ఇందులో అత్యంత కీలకమైన అంశం ఏంటంటే.. రాజధాని అమరావతి ప్రస్తావన, కొత్తగా ఏర్పడిన జిల్లాల సరిహద్దులను స్పష్టంగా పొందుపరిచారు. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలెట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని 'రాష్ట్ర రాజధాని' గా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. అయితే అమరావతికి ప్రత్యేక బౌండరీలను కేటాయించకుండానే, ఆ ప్రాంతాన్ని రాజధానిగా గుర్తించడం గమనార్హం. ఈ నూతన మ్యాప్‌లో రాజధాని అమరావతిని ప్రత్యేకంగా హైలైట్ చేశారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల సరిహద్దుల మధ్యలో అమరావతిని.. రాష్ట్ర రాజధానిగా చూపుతూ మ్యాప్‌ను రూపొందించారు. ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేసేందుకు.. గతంలో ఉన్న 2లో

# అమరావతి చరిత్రలో అందరూ భాగస్వామ్యులే



(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ స్థలంలో సుమారు 20 వేల మంది కార్మికులు, నిపుణులు పని చేస్తున్నారు. ప్రతి నిర్మాణ సంస్థ ఎంత మేరకు పనులు పూర్తి చేసింది, టార్గెట్లను ఎంతవరకు సాధించింది అనే విషయాలపై పనుల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కార్మికుల సంఖ్య, యంత్రాల వినియోగం వంటి అంశాలపై కూడా సమగ్ర చర్చ చేపట్టారు. వారం, నెలవారీ టార్గెట్ లు నిర్దేశించుకుని పనులు పూర్తి చేయాలని అధికారులను, సంస్థల ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వర్షాకాలం ముందు పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు తమ లక్ష్యాలను సీఎంకు వివరించారు. రాజధాని నిర్మాణాన్ని కేవలం కాంట్రాక్ట్ వర్క్‌గా చూడొద్దని.. ఇప్పుడు పనులు చేపట్టే వారంతా చరిత్రలో భాగస్వాములవుతున్నట్లే అని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. 'నిర్మాణ సంస్థలు మీరు ఎన్నో ప్రాజెక్టులు చేసి ఉంటారు.. కానీ రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం అందరికీ దక్కదు. రాజధానిని అద్భుతంగా, వినూత్నంగా నిర్మించేందుకు అపార అవకాశాలున్నాయి. అమరావతిని ఫ్యూచర్ సిటీగా నిర్మించాలనే ప్రభుత్వ ఆలోచనను క్షేత్రస్థాయిలో అమలు చేసి చూపించాల్సింది మీరే. నాణ్యతతో నిర్మాణాలు ఉండాలి... కాస్ట్ ఎఫెక్టివ్ చర్యలు తీసుకోవాలి. గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ వంటి వాటిని వినియోగించుకోవాలి. రాజధాని ప్రతిష్ఠను పెంచేలా ఎవరికైనా ఆలోచనలు వస్తే వాటిని ప్రభుత్వంతో పంచుకోవచ్చు. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి నిర్మాణం పూర్తి చేసి తీరాల్సిందే. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ ఉండదు. మ్యాన్ పవర్ పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షకు మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీ ఉన్నతాధికారులు, రాజధాని నిర్మాణ పనులు చేపట్టిన వివిధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో వివిధ దశల్లో రూ.57,821 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయి. హౌసింగ్, రోడ్లు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం వంటి ఐకానిక్ భవనాల నిర్మాణం వేగంగా జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన, రద్దు చేసిన పనుల సంబంధిత వివాదాలు, సమస్యలను పరిష్కరించి సీఆర్డీఏ మళ్లీ పనులను చేపట్టింది. నాటికి నేటికి నిర్మాణ వ్యయం పెరగడం వంటి సవాళ్లను అధిగమించి టెండర్లు పూర్తి చేసి పనులను అప్పగించింది సీఆర్డీఏ.

# మాచర్ల ఘటనపై మహిళా కమీషన్ సీరియస్

(మొదటి పేజీ తరువాయి)

మహిళలపై దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇలాంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. బాధితురాలికి వైద్య సహాయం, భద్రత, న్యాయం కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం బాధితురాలు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఆమెకు తీవ్ర గాయాలు అయినప్పటికీ వైద్యుల పర్యవేక్షణలో పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. వైద్య బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందిస్తోంది. బాధితురాలికి అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచనలు జారీ అయ్యాయి. కాగా, ఏప్రిల్ 2 సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో మాచర్లలో నివాసం ఉంటున్న మహిళ ఇంటికి నిందితుడు నీళ్ల పేరుతో వెళ్లాడు. తలుపు తెరిపించి అనంతరం బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించి దాడికి పాల్పడ్డాడు. మహిళను అదుపులోకి తీసుకుని నోట్లో బట్టలు కుక్కి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. అంతేకాకుండా నిందితుడు కత్తితో దాడి చేసి బాధితురాలిని తీవ్రంగా గాయపరిచాడు. మర్మాంగాలపై కూడా దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో బాధితురాలు తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలగా వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానికంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతుండగా, నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


# అమరావతిపై తీర్మానం శాశ్వతం కాదు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. అమరావతి నిర్మాణం విషయానికి వస్తే, గతంలో టీడీపీ ప్రభుత్వంలో కేవలం 5 శాతం పనులే పూర్తయ్యాయని బొత్స పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటిపోయినా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. ఇప్పటివరకు అమరావతిపై ఎంత ఖర్చు చేశారు, ఎంత ఫిజికల్‌గా పనులు జరిగాయి, ఎంత మొత్తాన్ని అడ్వాన్స్‌లుగా ఇచ్చారు అనే వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణ వ్యయం మొదట లక్ష 16 వేల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పుడు అది రెండు లక్షల కోట్లకు పెరిగిందని ఆయన చెప్పారు. నిర్మాణ వ్యయాల్లో భారీ పెరుగుదలపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, న్యాయమూర్తులు, ప్రభుత్వ ఉద్యోగుల కోసం నిర్మించిన భవనాలను పూర్తి చేసి ఎందుకు కేటాయింపులు చేయలేదని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా అంశాన్ని కూడా ప్రస్తావిస్తూ, పార్లమెంట్‌లో అమరావతిపై చూపిన శ్రద్ధను ప్రత్యేక హోదా సాధనపై ఎందుకు చూపలేదని ప్రశ్నించారు బొత్స. ప్రత్యేక హోదా వస్తే ముంబై స్థాయి నగరాలు, అనేక అభివృద్ధి కేంద్రాలు రాష్ట్రంలో ఏర్పడే అవకాశముందని అన్నారు. అమరావతిని ఆపేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేసిన బొత్స, ప్రభుత్వం ముందుగా నిర్మాణ పనులను పూర్తి చేసి తరువాతే ప్రకటనలు చేయాలని సూచించారు. కేవలం పేర్లు పెట్టడం లేదా ప్రకటనలు చేయడం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదని విమర్శించారు. మొత్తంగా అమరావతి అంశంలో రాజకీయ విమర్శలు ముదురుతున్న నేపథ్యంలో, బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీసే అవకాశముంది.

# ఆందోళన కలిగిస్తున్న గ్యాస్ కొరత

## సంక్షోభంతో హోటల్ పరిశ్రమ కుదేలు....సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



పల్నాడు (తెలుగోడు), ఏప్రిల్ 4 :

దేశవ్యాప్తంగా గ్యాస్, ఆయిల్ రంగాలలో ఏర్పడిన సంక్షోభం సాధారణ ప్రజలపై భారంగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి, రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ విస్తరించిందని, చిన్న హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు గ్యాస్ సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జీవనోపాధి కోల్పోయిన యువకులు, కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధికారులు మార్కెట్లో గ్యాస్ అందుబాటులో ఉందని చెబుతున్నా, వాస్తవానికి అది సామాన్య ప్రజలకు అందడం లేదని విమర్శించారు. కృష్ణా-గోదావరి బేసిన్‌లో పుష్కలంగా గ్యాస్ వనరులు ఉన్నప్పటికీ, ప్రైవేట్ కంపెనీలు రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్‌ను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాయని, రాష్ట్రానికి మాత్రం సరిపడా సరఫరా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అవసరం రోజుకు కేవలం 4 వేల టన్నులే అయినప్పటికీ, ఆ అవసరాన్ని కూడా తీర్చకపోవడం అన్యాయమని అన్నారు. దీనివల్ల విదేశాల నుంచి అధిక ధరలకు గ్యాస్ దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, ఆ భారాన్ని వినియోగదారులపై మోపుతున్నారని పేర్కొన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్‌ను స్థానికంగా పైప్‌లైన్‌ల ద్వారా పీఎన్‌జీగా సరఫరా చేస్తే, గృహాలకు తక్కువ ధరకే గ్యాస్ అందుబాటులోకి వస్తుందని, ఇది సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు పెద్ద ఊరట కలిగిస్తుందని వివరించారు. నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, రాష్ట్రానికి న్యాయమైన గ్యాస్ వాటాను సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మా గ్యాస్-మా హక్కు' నినాదంతో వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొదటిగా రాజమండ్రిలో భారీ ప్రజాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా మద్దతుతో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# ట్రంప్ నియంత్రణలో మోదీ

(మొదటి పేజీ తరువాయి)

మోదీ నియంత్రిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఇడుక్కిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన ఆయన, బీజేపీతో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ కుమ్మక్కయిందని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, లెఫ్ట్ ఫ్రంట్ మధ్య సంబంధాలు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. లెఫ్ట్ ఫ్రంట్‌లో ఎన్నో సంవత్సరాలు సిద్ధాంతాల కోసం పనిచేసిన నాయకులు ఇప్పుడు పార్టీ తమను వంచించిందని భావిస్తున్నారని చెప్పారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో కుమ్మక్కయినందునే ఎల్డీఎఫ్ తన వామపక్ష భావజాలాన్ని కోల్పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఎప్పుడూ సిద్ధాంతపరంగా పోరాడిందని, కానీ ఇప్పుడు ఎల్డీఎఫ్ పూర్తిగా మారిపోయిందన్నారు. కేరళలో ప్రభుత్వాన్ని ఒక చీకటి శక్తి ప్రభావితం చేస్తోందని, అది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ ప్రజలపై ప్రభావం చూపుతోందని పరోక్షంగా విమర్శించారు. ప్రధానమంత్రి ఏ రాష్ట్రానికి వెళ్లినా మతం, ఆలయాల గురించి మాట్లాడతారని, కానీ కేరళ సమస్యలపై మాత్రం మౌనం పాటిస్తున్నారని అన్నారు. శబరిమల బంగారం కేసు విషయమై స్పందించకపోవడం దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకంగా పోరాడుతున్నందున తనపై అనేక కేసులు పెట్టారని, విచారణలు ఎదుర్కొన్నానని తెలిపారు. అయినప్పటికీ తాను వెనుదీయలేదని స్పష్టం చేశారు. మోదీ ప్రతిరోజూ తనపై విమర్శలు చేస్తున్నప్పటికీ, కేరళ ముఖ్యమంత్రి లేదా ఆయన కుటుంబంపై ఒక్క మాట కూడా మాట్లాడరని అన్నారు. జాతీయ అంశాలపై ఎల్డీఎఫ్ ఎప్పుడూ సవాలు చేయకపోవడమే ఇందుకు కారణమని వ్యాఖ్యానించారు. ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాష్ట్రంలో రాజకీయ వాతావరణం మరింత ఉత్కంఠభరితంగా మారుతోంది.

# త్రిభాషా విధానంపై ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) విద్యార్థులు మూడు భాషల్ని చదవాలని తెచ్చిన కొత్త పాఠ్యప్రణాళిక విధానం నిష్కపటమైన విద్యా సంస్కరణ కాదు. ఇది హిందీని బలవంతంగా రుద్దాలని ఉద్దేశపూర్వకంగా చేసే ప్రయత్నం. ఇది బిజెపి హిందీని మాపై బలవంతంగా రుద్దుతుంది అన్న ఆందోళనల్ని నిజం చేస్తుంది. భారతీయ భాషలను ప్రోత్సహించే ముసుగులో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం భారతదేశపు గొప్ప, వైవిధ్యభరితమైన భాషా వారసత్వాన్ని క్రమపద్ధతిలో అణచివేస్తూ, హిందీని ప్రాధాన్యతనిచ్చే కేంద్రీకరణ ఎజెండాను దూకుడుగా ముందుకు తీసుకెళ్తోంది. మూడు భాషల సూత్రం అని పిలిచేది వాస్తవానికి హిందీ మాట్లాడని ప్రాంతాలలోకి హిందీని విస్తరించడానికి ఉద్దేశించిన ఒక రహస్య యంత్రాంగం. కేంద్ర ప్రభుత్వ పాఠ్య ప్రణాళిక విధానం హిందీ మాట్లాడే విద్యార్థులకు నిర్మాణాత్మకంగా ప్రాధాన్యతనిస్తుంది. నిష్పక్షపాతాన్ని, సమాఖ్యవాదాన్ని, ప్రాంతీయ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది' అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ఇలాంటి విధానాలు భారతదేశ భాషా వైవిధ్యానికి ముప్పు కలిగిస్తాయని స్టాలిన్ హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రాంతీయ గుర్తింపు కోసం నిలబడాలని తమిళనాడులోని ఏఐఎడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలకు ఆయన పిలుపునిచ్చారు.
÷-రిభాషా విధానం వల్ల దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులను హిందీని నేర్చుకోవడం తప్పనిసరి చేస్తుంది. మరి హిందీ మాట్లాడే రాష్ట్రాల విద్యార్థులు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, లేదా బెంగాలీ, మరాఠీ వంటి భాషలను కూడా తప్పనిసరిగా నేర్చుకుంటారా? దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు, ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు మధ్య నేర్చుకునే విధానంలో స్పష్టత లేదు. ఈ విధానం ఏకపక్షంగా హిందీని రుద్దడమనే వివక్షాపూరిత స్వభావాన్ని బయటపెడుతుంది. ఈ వైరుధ్యం ఆమోదయోగ్యం కాదు. కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ పాఠశాలల్లో తమిళాన్ని తప్పనిసరి భాషగా చేయడంలో విఫలమైంది. తమిళ భాషను బోధించడానికి తమిళ ఉపాధ్యాయులను నియమించడంలో విఫలమైంది. మరి ఇప్పుడు అదే కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలను ప్రోత్సహించడంపై రాష్ట్రాలకు ఉపన్యాసాలు ఇవ్వాలని చూస్తోందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. ఇది భాషల పట్ల కేంద్రం చూపే వైఖరి నిబద్ధత కాదు.. పచ్చి కపటత్వం అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ధ్వజమెత్తారు. మిళనాడు అనేక ఇతర రాష్ట్రాలు లేవనెత్తి చట్టబద్ధమైన, స్థిరమైన ప్రజాస్వామ్యయుతమైన ఆందోళనలను పక్కనపెట్టి, హిందీని రుద్దడానికి కేంద్ర ప్రభుత్వం నిశ్చయించుకున్నట్లు కనిపిస్తోంది. ఈ విధానం సహకార సమాఖ్యవాద సూత్రాలకు విరుద్ధం. లక్షలాది మంది భారతీయుల భాషా గుర్తింపు అవమానించడమే అని స్టాలిన్ అన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడులోని తిరు పళనిస్వామి నేతృత్వంలోని ఏఐఏడిఎంకె, దాని ఎన్‌డిఎ మిత్రపక్షాలు ఈ రుద్దకాన్ని అంగీకరిస్తాయా? లేక ఒక్కసారైనా మన విద్యార్థుల హక్కులు, గుర్తింపు, భవిష్యత్తు కోసం నిలబడతాయా? అని స్టాలిన్ ఎక్స్ పోస్టులో ప్రశ్నించారు.

# టిటిడి ఛైర్మెన్‌గా బీ ఆర్ నాయుడిని తొలగించాలని వైసీపీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, నిరసనలు




అమరావతి (తెలుగోడు), ఏప్రిల్ 4 :

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నిరసనలు చేపట్టింది. వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నేతలు.. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ నిరసనలు చేపట్టారు. బీఆర్ నాయుడు రాసలీలలు వెలుగులోకి వచ్చినా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోకపోవటంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికీ బీఆర్ నాయుడిని వెనకేసుకువస్తున్న చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. ప్రపంచవ్యాప్త హిందూ భక్తులు, నెటిజన్ల విమర్శలను కూడా చంద్రబాబు పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ మండిపడుతోంది. పులివెందులలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో 101 టెంకాయలు కొట్టి వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ నాయుడు అనైతిక కార్యకలాపాలు, ఆయన వ్యవహార శైలితో టీటీడీ పవిత్రతను దెబ్బతీస్తున్నాడని ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ నాయుడు టీటీడీ చైర్మన్ పదవి నుంచి వెంటనే తొలగించి టీటీడీ పవిత్రతను కాపాడాలని వైఎస్సార్‌సీపీ నాయకుల డిమాండ్ చేశారు. ఈ నిరసన మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నాయి. అనంతపురంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు ఆందోళన నిర్వహించారు. అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్లకార్డులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ మండిపడ్డారు. విశాఖ తూర్పు నియోజకవర్గంలోని వెంటేశ్వరస్వామి వారి ఆలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించాయి. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు రమణకుమారి, మాజీ మేయర్ హరి వెంకట కుమారి తదితరులు పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. బీఆర్ నాయుడిని టీటీడీ ఛైర్మన్ పదవి నుండి తొలగించాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే, మల్లాది విష్ణు, వైఎస్సార్‌సీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు. బీఆర్ నాయుడిని టీడీడీ ఛైర్మన్ పదవికి రాజీనామా




చేయాలంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు ప్లకార్డులు ప్రదర్శించారు. టీటీడీ పవిత్రతను కాపాడాలంటూ నినాదాలు చేశారు.

**పసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కరుణాకర్‌రెడ్డి, రోజా ప్రత్యేక పూజలు ..**

టీటీడీ ఛైర్మన్ నుంచి బీఆర్ నాయుడిని తొలగించాలని వైఎస్సార్‌సీపీ నేత, టీటీడీ మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడిను తొలగించాలంటూ నిరసన చేపట్టారు. అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కరుణాకర్‌రెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ నాయుడు వచ్చాక అనేక వివాదాలు, అపశ్రుతులు జరిగాయని.. తిరుమల ప్రతిష్టకు భంగం కలిగేలా బీఆర్ నాయుడు వ్యవహరించారన్న భూమన.. బీఆర్ నాయుడిని తొలగించకపోతే మరింత ఉధృతంగా నిరసనలు చేస్తామని హెచ్చరించారు. ఆర్కే రోజా మాట్లాడుతూ.. బీఆర్ నాయుడిని టీటీడీ ఛైర్మన్‌గా కొనసాగించడం చంద్రబాబు చేతగానితనం అంటూ మండిపడ్డారు. లడ్డూ గురించి చంద్రబాబు పచ్చి అబద్దాలు మాట్లాడారని దుయ్యబట్టారు. మహిళను 30
ఏళ్లుగా బీఆర్ నాయుడు చిత్రహింసలకు గురిచేశాడు. సీఎం చంద్రబాబు, నారా లోకేష్ వ్యక్తిగత విషయాలు బీఆర్ నాయుడు బయటపెడతారని భయపడుతున్నారా అని నిలదీసారు.

# మోదీపై కెనడా ప్రధాని ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

కూడా ప్రజలకు చేరువ కావడంపై మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతారని తెలిపారు. తన పనిపట్ల ఆయనకు ఉన్న అంకితభావం ఆదర్శప్రాయమని అన్నారు. గ్రామీణ ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. యూపీఐ విధానం ద్వారా నేరుగా లబ్ధిదారులకు నగదు బదిలీ సాధ్యమవుతోందని, దీని వల్ల అనేక మంది ప్రధాన ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు అవుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ అభివృద్ధికి మోదీ కీలక పాత్ర పోషించారని అన్నారు. గతంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు కొంత దెబ్బతిన్న నేపథ్యంలో, వాటిని పునరుద్ధరించేందుకు కెనడా ప్రభుత్వం కృషి చేస్తోందని కార్నీ వెల్లడించారు. ఇందులో భాగంగా ఇటీవల భారత్ పర్యటన చేపట్టినట్టు తెలిపారు. భారత్ ఇంధన అవసరాలను తీర్చేందుకు కెనడా తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. యూరేనియం సరఫరా కోసం దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు వెల్లడించారు. రెండు దేశాల ప్రజల మధ్య బలమైన అనుబంధం ఉన్నదని, కెనడాలో లక్షలాది భారతీయ మూలాల ప్రజలు నివసిస్తున్నారని గుర్తుచేశారు. రక్షణ రంగంలో కూడా సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయని కెనడా ప్రధాని స్పష్టం చేశారు..

# అమరావతి పేరుతో కూటమి దోపిడి

(మొదటి పేజీ తరువాయి)

రాజధాని పేరుతో భారీ అప్పులు తెచ్చి వాటి భారాన్ని ప్రజలపై మోపుతున్నారని తెలిపారు. తక్కువ వడ్డీకి రుణాలు లభ్యమవుతున్న సమయంలో అధిక వడ్డీకి అప్పులు తీసుకురావడం సరికాదని ప్రశ్నించారు. ఆ అప్పులను చెల్లించాల్సింది చివరకు ప్రజలేనని పేర్కొన్నారు. రాజధాని అంశాన్ని కుల రాజకీయాలతో కలిపి వివాదాస్పదంగా మార్చే ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై సరైన స్పందన రాకపోవడాన్ని ప్రశ్నిస్తూ, కొందరి వ్యాఖ్యలకు మద్దతుగా వ్యవహరించడం ఆందోళనకరమని అన్నారు. అమరావతి భవిష్యత్తుపై స్పష్టత లేకుండా పెద్ద పెద్ద ప్రణాళికలు చెబుతున్నారని విమర్శించారు. అప్పుల ఆధారంగా నిర్మాణాలు చేపట్టి అభివృద్ధి సాధ్యమా అనే సందేహాలను వ్యక్తం చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో రాజధాని అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అప్పుల ద్వారా నిర్మాణాలు చేపడితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పరిమితంగానే ఉంటుందని, ఇచ్చే రాయితీలతో అది కూడా తగ్గిపోతుందని తెలిపారు. ప్రజల డబ్బుతో నిర్మాణాలు చేసి నిజమైన అభివృద్ధి సాధించాలంటే పారదర్శకత అవసరమని, లేకపోతే అది మరోసారి భారంగా మారుతుందని హెచ్చరించారు.

# అమరావతిపై అనేక సందేహాలు

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు శాశ్వత రాజధాని నిర్ణయానికి వర్తించవని వ్యాఖ్యానించారు. రాష్ట్రం తన రాజధానిని స్వయంగా నిర్ణయించుకోవడం ప్రధాన బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. చట్టం ద్వారా రాజధానిని నిర్ణయించడం ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధమవుతుందని, ఇది రాష్ట్ర అధికారాలను కేంద్రం చేతుల్లోకి తీసుకునే పరిస్థితిని కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి నిర్ణయాలు భవిష్యత్‌లో పరిపాలనా సమస్యలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరించారు. అమరావతి ఎంపికలో ప్రజల అభిప్రాయం సేకరించలేదని, సరైన సంప్రదింపులు జరగలేదని ఆయన విమర్శించారు. గతంలో పునర్వ్యవస్థీకరణ చట్టాలు రాజధానులను నిర్ణయించలేదని, ఆ బాధ్యతను రాష్ట్రాలకే వదిలివేశాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని ఎవరైనా కోర్టులో సవాల్ చేస్తే రద్దయ్యే అవకాశం కూడా లేకపోలేదని, దాని ప్రభావం పాలనపై పడవచ్చని ఆయన అంచనా వేశారు. రాజధాని ఎంపిక ఆర్థిక, పరిపాలనా అంశాల ఆధారంగా ఉండాలి గానీ చట్టపరమైన నిర్బంధంతో కాకూడదని స్పష్టం చేశారు.

# పదవతరగతి విద్యార్థులకు అదనపు మార్కులు

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ప్రిన్సిపల్ వాల్యుయేషన్‌కు సంబంధించిన మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించింది. ప్రశ్నాపత్రంలోని కొన్ని ప్రశ్నల్లో అస్పష్టత, పొరపాట్లు ఉన్నట్లు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. హిందీ విషయంలో 2 మార్కులు, ఇంగ్లీష్ విషయంలో 5 మార్కులు వాల్యుయేషన్ చేసే ఉపాధ్యాయులు కలపనున్నారు. మొత్తం మూడు ప్రశ్నల్లో ఈ సమస్యలు ఉన్నందున వాటికి సమాధానాలు రాసిన విద్యార్థులకు ఈ మార్కులు వర్తించనున్నాయి. దీంతో విద్యార్థులకు ఎటువంటి అన్యాయం జరగకుండా బోర్డు ఈ చర్యలు చేపట్టింది.

# అమెరికా యుద్ధ విమానాన్ని కూల్చిన ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయి. ముఖ్యంగా ఆర్థికంగా బలహీనపరచాలన్న లక్ష్యంతో దాడులు కొనసాగిస్తున్నాయి. అయితే ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తోంది. ప్రత్యర్థి దేశాలకు గట్టి ప్రతిస్పందన ఇస్తూ తమ రక్షణ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో అమెరికాకు చెందిన రెండు యుద్ధ విమానాలను కూల్చివేసినట్టు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ సముద్రసంధి సమీపంలో జరిగిన ఈ ఘటన ఉద్రిక్తతలను మరింత పెంచింది. అమెరికాకు చెందిన ఒక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ అధికార వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో మరో అధునాతన యుద్ధ విమానాన్ని కూడా నేలకూల్చినట్లు పేర్కొన్నాయి. ఈ దాడులు తమ వైమానిక రక్షణ వ్యవస్థల సామర్థ్యాన్ని చాటిచెప్పుతున్నాయని ఇరాన్ పేర్కొంది. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన ఒక గూఢచారి డ్రోన్‌ను కూడా ఇరాన్ కూల్చివేసినట్టు సమాచారం. ఇస్ఫహాన్ ప్రావిన్స్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించింది. ఆధునిక వైమానిక రక్షణ వ్యవస్థల సహాయంతో ఈ డ్రోన్‌ను అడ్డుకున్నామని తెలిపింది. ఇరాన్ చేసిన ఈ చర్యలు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు గట్టి హెచ్చరికగా భావించబడుతున్నాయి. ఒకవైపు దాడులు కొనసాగుతుండగా, మరోవైపు వాటిని సమర్థంగా అడ్డుకుంటున్నామని ఇరాన్ చెబుతోంది. ఈ పరిణామాలు ప్రాంతంలో యుద్ధ మబ్బులు మరింత కమ్ముకునేలా చేస్తున్నాయి.

# 28 జిల్లాలతో కొత్తగా ఏపి మ్యాప్

(మొదటి పేజీ తరువాయి)

26 జిల్లాలకు అదనంగా.. ఇటీవల మార్కాపురం, పోలవరం అనే రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండు జిల్లాల సరిహద్దులను కూడా తాజా మ్యాప్‌లో తెలియజేశారు. దీంతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. రాష్ట్ర విపత్తు నిర్వాహణ శాఖ ఈ మ్యాప్‌ను విడుదల చేయడం వెనుక ప్రధాన ఉద్దేశం.. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో జిల్లాల వారీగా సహాయక చర్యలు చేపట్టడానికి స్పష్టమైన భౌగోళిక సమాచారం ఉండటమే. కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత సరిహద్దుల విషయంలో ఉన్న సందిగ్ధతను ఈ మ్యాప్ తొలగించనుంది.

# నేత్ర పర్వంగా చక్ర స్నానం

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 9.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు తిరుచ్చిలో, సుదర్శన చక్రత్తాళ్వార్ పల్లకిలో ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఉదయం 10.30 నుండి 11.15 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వేడుకగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో సీతారామ లక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంతో అభిషేకాలు అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

# 6న యాడికిలో ముఖ్యమంత్రి పర్యటన

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



**యాడికి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 06వ తేదీన యాడికి మండల కేంద్రంలో పర్యటించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి సవరించిన షెడ్యూల్ వివరాలను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 09:30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసం నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు. ఉదయం 11:10 గంటలకు అనంతపురం జిల్లా యాడికి మండలం వేములపాడు గ్రామంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. ఉదయం 11:10 గంటల నుంచి 11:20 గంటల వరకు హెలిప్యాడ్ లో ప్రజా ప్రతినిధులు, అధికారుల నుండి స్వాగతం స్వీకరిస్తారు. ఉదయం 11:20 గంటలకు హెలిప్యాడ్ నుంచి బయలుదేరి యాడికి గ్రామ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించే "ప్రజా వేదిక" సమావేశం వద్దకు చేరుకుంటారు. ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 1:00 వరకు యాడికి గ్రామ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించే "ప్రజా వేదిక" సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 1:00 గంట నుంచి 1:30 వరకు రిజర్వ్ చేశారు. మధ్యాహ్నం 01:30 గంటలకు యాడికి గ్రామ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన "ప్రజా వేదిక" నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:40 గంటలకు యాడికి మండలం వేములపాడు వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:40 గంటల నుంచి 02:30 వరకు వేములపాడు గ్రామం వద్ద ఉన్న పెండేకల్లు రిజర్వాయర్ తీర ప్రాంతాన్ని సందర్శిస్తారు. అక్కడ నీటి సంరక్షణ పనులు ( పి ఎం డి ఎస్ మరియు హాఫ్ మూన్ మోడల్) పరిశీలిస్తారు. అనంతరం అక్కడి నుంచి 2:30 గంటలకు బయలుదేరి 2:40 గంటలకు హెలిప్యాడ్ కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:40 నుండి సాయంత్రం 4:10 వరకు హెలిప్యాడ్ లో వేములపాడులో నిర్వహించే కార్యకర్తల సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 4:20 గంటలకు వేములపాడు హెలిప్యాడ్ నుండి హెలికాప్టర్ ద్వారా తిరుగు ప్రయాణమవుతారు. సాయంత్రం 6:00 గంటలకు: ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని, భద్రత పరంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



గాలి మరల నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న అధికారులు

# గాలి మరల నిర్మాణానికి స్థల పరిశీలన

**ముద్దనూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
మండల పరిధిలో గాలిమరల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి శనివారం జిల్లా, స్థానిక అధికారులు స్థల పరిశీలన చేశారు. ఏ ఎం పి యు ఎస్, విండో సంస్థ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడంతో, చింతకుంట, బొందలకుంట, మంగపట్నం,కొలవలి, పెద్ద దుద్యాల, ఉప్పలూరు, గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలించారు.

# గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

**ముద్దనూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
ముద్దనూరు కొండాపురం రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్నా ప్రైవేట్ భూమిలో ఉన్న వేప చెట్టుకు ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ నగేష్ బాబు, ఎస్సై మధుసూదన్ రెడ్డి, సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే దాదాపు మూడు రోజుల క్రితమే మృతుడు, మృతి చెంది ఉంటాడని, లుంగీ తో వేప చెట్టుకు ఉరి వేసుకొని చనిపోయినట్లు తెలిపారు. అయితే అతని దగ్గర ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేని కారణంగా మృతుని వివరాలు తెలియ లేదన్నారు. అతని వివరాలు తెలిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచార ఇవ్వాలని పోలీసులు పేర్కొన్నారు.





అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

# సైబర్ మాయగాళ్ల 'ఉచిత ఇంటర్నెట్' వలకు చిక్కవద్దు

**సోషల్ మీడియాలో పుకార్లొద్దు.. బాధ్యతగా ఉండాలి..**
**'ఫ్రీ వైఫై' ప్రమాదాలపై జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హెచ్చరిక..**

**మదనపల్లె (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
ఆధునిక కాలంలో పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల జిల్లా ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రజలకు సూచించారు. ముఖ్యంగా ఉచితంగా లభించే వైఫై నెట్‌వర్క్‌ల ద్వారా కొత్త రకమైన మోసాలు వెలుగులోకి వస్తున్నాయని, వీటి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

***ఉచిత వై-ఫైతో డేటా చోరీ..***
కాఫీ షాపులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో లభించే ఉచిత వై-ఫై నెట్‌వర్క్‌ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచించారు. "ఫ్రీ వై-ఫై" పేరుతో జరుగుతున్న ఈ కొత్త రకమైన ఫిషింగ్ దాడుల ద్వారా మోసగాళ్లు మీ వ్యక్తిగత సమాచారాన్ని, మాల్వేర్ ద్వారా డేటాను తస్కరించే అవకాశం ఉందని హెచ్చరించారు. పబ్లిక్ వై-ఫై వాడుతున్నప్పుడు బ్యాంకింగ్ లావాదేవీలు, ఆన్‌లైన్ షాపింగ్ చేయవద్దు. అపరిచిత వైఫై హాట్‌స్పాట్‌లకు ఫోన్లను కనెక్ట్ చేయకపోవడమే శ్రేయస్కరం. ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లతో పాటు 'టూ స్టెప్ వెరిఫికేషన్' తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

***లింకులు క్లిక్ చేస్తే.. నిధులు మాయం..***
ప్రభుత్వ పథకాల పేరుతో వచ్చే అపరిచిత లింకులను నమ్మి క్లిక్ చేయవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. పథకాల దరఖాస్తు కోసం అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలని, ఎవరికీ బ్యాంక్ వివరాలు, ఓటీపీ లేదా పిన్ నంబర్లు పంచుకోవద్దని కోరారు. ఒకవేళ ఎవరైనా ఆర్థికంగా సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా ఞఞ.ఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.ఱఅ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో బాధ్యతా యుతమైన పౌరులుగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇతర సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రతి వార్తను నిజమని నమ్మి ఇతరులకు షేర్ చేయవద్దు. అది సమాజ శాంతికి భంగం కలిగించేలా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు చేశారు.

***అపరిచితులతో స్నేహం వద్దు..***
వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి ద్వారా వచ్చే అపరిచితుల పరిచయాలకు దూరంగా ఉండాలని, ఫేక్ ప్రొఫైల్స్ ద్వారా వచ్చే రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని ఎస్పీ వెల్లడించారు. ఆకర్షణీయమైన ఫోటోలకు, మాటలకు లోబడి, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు పంపించి ఇబ్బందుల్లో పడవద్దని ఎస్పీ సూచించారు. ఇటీవల చాలామంది మోసాలకు గురవుతుండగా, కుటుంబాల సైతం వీధిన పడుతున్నాయని పేర్కొన్నారు.

***చట్టపరమైన చర్యలు..***
సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల రహిత అన్నమయ్య జిల్లాగా తీర్చిదిద్దడంలో పోలీసులకు సహకరించాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కోరారు.

# సాఫ్ట్‌వేర్ డెవలపర్ 'చాంద్'కి తుకడ!

**అఖిల భారత స్థాయిలో మెరిసిన తాడిపత్రి విద్యార్థి చాంద్ హఫీజ్ నవాజ్..**
**ఇంటర్ నుంచే సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా అరుదైన ప్రతిభ..**
**ఇన్‌స్టాగ్రామ్‌లో యాడ్‌తో మొదలైన విజయయాత్ర..**
**దేశవ్యాప్తంగా 90 వేల మందిలో టాప్‌వన్‌గా సెలెక్ట్..**
**పలు అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సేవలు..**
**రక్షణ శాఖ నుంచి ప్రత్యేక ప్రశంసలు..**

**తాడిపత్రి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
ప్రస్తుతం సమాజంలో యువత ఎక్కువగా సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి ఎన్నో వాటి మోజులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు వీడియోలు వైరల్ కోసం రీల్స్‌తో పిచ్చి పిచ్చి పనులు చేస్తూ ప్రాణాలను సైతం పోగొట్టుకుంటున్నారు. అయితే అదే సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని ఉపయోగించుకుంటూ కొందరు విద్యార్థులు ఉన్నత శిఖరాలను అవరోహిస్తున్నారు. ఇదే కోవకు వస్తారు తాడిపత్రి పట్టణానికి చెందిన చిరిసాపల చాంద్ హఫీజ్ నవాజ్. ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లోనే చాంద్ హఫీజ్ నవాజ్ ఆన్‌లైన్ ద్వారా పలు కంపెనీలు నిర్వహిస్తున్న టెస్టులలో పాల్గొని మంచి గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా చాలా మెడల్స్, మెమెంటోలు సైతం దక్కించుకున్నాడు. అతిపిన్న వయసులోనే కృషి, పట్టుదల, ఆత్మస్థైర్యం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు, ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చు అనేందుకు చిరిసాపల చాంద్ హఫీజ్ నవాజ్ నిదర్శంగా నిలిచాడు. ఇంటర్మీడియట్‌తోనే ఉన్నత శిఖరాన్ని అధిరోహించి అఖిల భారత స్థాయిలో మెరిసిన చాంద్ హఫీజ్ నవాజ్ తన ప్రతిభను చాటుకున్నాడు.
ఇన్‌స్టాగ్రామ్‌లో చాంద్ హఫీజ్ నవాజ్ ఒకరోజు ఒక యాడ్ చూసి ప్రభావితమై ఐఐటి ఖరగ్ పూర్‌వారు నిర్వహించిన నేషనల్ పోర్టల్ టెక్నాలజీ ఎన్‌హ్యాన్స్ లర్నింగ్ (ఎన్ పిటిఈఎల్)లో ఎథికల్ హ్యాకింగ్ కోర్స్ ట్రైనింగ్‌లో చేరాడు. ఆన్‌లైన్ కోర్స్ ట్రైనింగ్ తీసుకొని అనంతరం వారు పెట్టిన ఆన్‌లైన్ టెస్టుల్లో ఎంతో ప్రతిభ కనపరిచాడు.
ఎన్‌పిటిఈఎల్ వారు 2023లో భారతదేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించగా అందులో దాదాపు 90 వేల మంది పాల్గొన్నారు. అందులో ఇద్దరు మాత్రమేం ఎంపికయ్యారు. సౌత్ ఇండియా నుండి చాంద్ హఫీజ్ నవాజ్ ఎంపికయ్యాడు. అనంతరం యూట్యూబ్‌లో అమెరికాకు చెందిన హ్యాకర్ ఎక్స్ కంపెనీ ప్రకటన చూసి ఎథికల్ హ్యాకర్ కోర్స్‌లో చేరాడు. హ్యాకర్ ఎక్స్ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ ఎగ్జామినేషన్‌లో పాల్గొని సెలెక్ట్ అయ్యాడు. హ్యాకర్ ఎక్స్ కంపెనీ వారు సర్టిఫికెట్‌తోపాటు సిల్వర్ కాయిన్, మెడల్, అవార్డ్ అందజేశారు. హ్యాకర్ ఎక్స్ కంపెనీ వారు ప్రముఖ కంపెనీలైన భారతదేశానికి చెందిన బీన్ లీ, బొటానికా, శ్రీలంకకు చెందిన డెన్ బీ డిస్క్ రీడింగ్ సాఫ్ట్ వేర్ వర్క్‌లను ఇతనికి అప్పగించారు. భారతదేశంలోని బీన్ లీ కాఫీ కంపెనీకి చెందిన అకౌంట్ రికవరీ, బొటానిక కంపెనీకి చెందిన సెక్యూరిటీ అప్డేట్ కోడింగ్, శ్రీలంకలోని డెన్ బీ కంపెనీకి చెందిన డిస్క్ రీడింగ్ సాఫ్ట్ వేర్ డెవలప్ చేశాడు.. ఆ కంపెనీల ప్రతినిధులు ు అనేక ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇండియన్ మినిస్టరీ ఆఫ్ డిఫెన్స్ వారు గూగుల్‌లో చేసిన పోస్ట్ ను చూసి అఫిషియల్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఆరుగురిని ఎంపిక చేసుకొని, వారికి వేర వేరుగా అసైన్మెంట్ ఇవ్వగా, వారు ఇచ్చిన డెడ్ లైన్ కంటే ఒక నెల ముందుగానే అసైన్మెంట్ పూర్తి చేసి ఔరా అనిపించుకున్నాడు. ఇండియన్ మినిస్టరీ ఆఫ్ డిఫెన్స్ సాఫ్ట్‌వేర్‌లో బగ్ ఉందని చాంద్ హఫీజ్ నవాజ్ కనుగొని సరి చేయడంతో ఇండియన్ మినిస్టరీ ఆఫ్ డిఫెన్స్ వారు షీల్డ్‌తో అభినందించారు.




ఇండియన్ మినిస్టరీ ఆఫ్ డిఫెన్స్ వారు అందించిన షీల్డ్‌తో చాంద్ హఫీజ్ నవాజ్

అనంతపురం నగరంలోని జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ బాలమురళి కృష్ణ సైన్స్ సెంటర్‌కు వెబ్ సైట్, ఆండ్రాయిడ్ యాప్ రూపొందించమని కోరగా, చాంద్ హఫీజ్ నవాజ్ ఉచితంగా రూపొందించిన వెబ్ సైట్, ఆండ్రాయిడ్ యాప్‌ను గత నెల 5న జిల్లా సైన్స్ సెంటర్‌లో అగస్త్య ఫౌండేషన్ సిఈఓ పుష్ప, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు ఆవిష్కరించారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సి.ఈ.ఓ హఫీజ్ బాషా మాట్లాడుతూ చాంద్ హఫీజ్ నవాజ్ సైన్స్ సెంటర్‌కు వెబ్ సైట్, ఆండ్రాయిడ్ యాప్ అందించడం గర్వ కారణమన్నారు. సి.ఈ.ఓ హఫీజ్ బాషా విద్యార్థి చాంద్ హఫీజ్ నవాజ్‌కు మెమెంటో అందజేశారు. పిన్న వయసులోనే తనకు అందివచ్చిన అవకాశాన్ని తనకు అనుకూలంగా మలుచుకుని తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును పొందిన చాంద్ హఫీజ్ నవాజ్ మరిన్ని విజయాలు సాధించాలని పలువురు మేధావులు కోరుకుంటున్నారు.

## అందరికీ పనికొచ్చే మెడీ బెడ్ ట్రాకర్ వెబ్ అప్లికేషన్

**– బిటెక్ విద్యార్థి చాంద్ హఫీజ్ నవాబ్**



వికాసిత్ భారత్, ఆత్మనిర్భర్ కోసం పిలుపులో మెడీ బెడ్ ట్రాకర్ వెబ్ అప్లికేషన్‌తో ఆకట్టుకున్నాడు చాంద్ హఫీజ్ నవాజ్. తాడిపత్రిలోని సర్ సీ.వీ. రామన్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న చాంద్ హఫీజ్ నవాబ్ మెడీ బెడ్ ట్రాకర్ ప్రాజెక్ట్ గురించి అద్భుతంగా ప్రెజెంటేషన్ ఇచ్చాడు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో బెడ్‌లు ఉన్నాయో లేదో తన వెబ్ అప్లికేషన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉందని తెలిపాడు. ఎక్కడైనా భారీ ప్రమాదం సంభవించినప్పుడు అంబులెన్స్ వారు తన వెబ్ అప్లికేషన్ ద్వారా ఏ ఆసుపత్రిలో బెడ్‌లు ఖాళీగా ఉన్నాయని తెలుసుకునే అవకాశం ఉందని, తద్వారా క్షతగాత్రులను తక్షణమే అక్కడికి తరలించి వైద్య సేవలు అందించ వచ్చునని తెలిపాడు. సామాన్య ప్రజలు కూడా అత్యవసర పరిస్థితులలో ఈ వెబ్ అప్లికేషన్ ద్వారా తమకు దగ్గరలోని ఆసుపత్రులలో వైద్య సేవలు పొందవచ్చునని తెలిపాడు. రానున్న రోజుల్లో ఈ వెబ్ అప్లికేషన్ ను ఆండ్రాయిడ్ యాప్ ను కూడా రుపొందిస్తానని తెలిపారు. ఈ యాప్ ద్వారా బ్లడ్, ఆర్గాన్ బ్యాంక్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తానని చాంద్ హఫీజ్ నవాజ్ తెలిపారు. తాడిపత్రిలోని సర్ సివి రామన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల కోసం డిజిటల్ నోటీస్ బోర్డ్ కోసం ఆండ్రాయిడ్ యాప్ రూపొందిస్తున్నానని చాంద్ హఫీజ్ నవాజ్ తెలుగోడు ప్రతినిధికి తెలిపారు. ప్రస్తుత అంతర్జాల యుగంలో ప్రతిభ ఉన్న ఎవరైనా తమ కళను నెరవేర్చుకోవచ్చునని, ఇంటర్నెట్‌లో ఏ పోటీ పరీక్షకైనా బోలెడు కంటెట్, మెటీరియల్ ఉందని, ఆత్మస్థైర్యంతో ముందడుగువేస్తే ఏదైనా సాధించవచ్చునని చాంద్ హఫీజ్ నవాజ్ తెలిపారు.



యాడికిలో సీఎం సమావేశానికి చురుగ్గా సాగుతున్న పనులు



అశ్వవాహనంపై దర్శనమిచ్చిన రాముడు

# సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**పనుల పరిశీలన..**
**జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్..**
**జిల్లా ఎస్పీ జగదీష్..**
**ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి..**

**యాడికి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
యాడికి మండల కేంద్రంలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో సభ పనులు, వేములపాడు గ్రామ సమీపంలో హెలిప్యాడ్ పనులను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ జగదీష్. ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి, ఆర్డిఓ శ్రీనివాసులు. డిపిఓ నాగరాజు నాయుడు. డి ఎల్ డి ఓ విజయలక్ష్మి. సి ఓ శివ శంకర్. ఐసిడిఎస్ సిడిపిఓ సాజిదా బేగం వివిధ శాఖ అధికారులు పరిశీలించారు. మార్కెట్ యార్డ్ నందు సీఎం సమావేశానికి ఎటువంటి లోతు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే





యాడికిలో సీఎం పర్యటన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి

వేములపాడు రోడ్డు లోని యాడికి కాలువ లో మరమ్మత్తులు చేసి పరిశుభ్రత చేశారు తహసిల్దార్ ప్రతాపరెడ్డి. ఎంపీడీవో వీర రాజు డిప్యూటీ ఎంపీడీవో శశికళ సీఐ శ్రీనివాసులు యాడికి పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ వివిధ గ్రామాల నుండి వచ్చిన సిబ్బందితో పనులను చేపడుతున్నారు. వేములపాడు గ్రామ సమీపంలో హెలిప్యాడ్ కోసం పనులను చురుకుగా చేపడుతున్నారు.



వేములపాడు గ్రామ సమీపంలో హెలిప్యాడ్ పనులు సాగుతున్న దృశ్యం



సీఎం సభ పనులను పరిశీలిస్తున్న డిపిఓ నాగరాజు నాయుడు. డి ఎల్ డి ఓ విజయలక్ష్మి ఎంపీడీవో వీర రాజు

# అశ్వవాహనంపై కల్కి అవతారంలో నీల మేఘశ్యాముడు

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
నగరంలోని ఒకటో రోడ్డు లోని శ్రీ కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా అశ్వ వాహనం పై వాహనమును అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం రామయ్య సువర్ణ ఆభరణాలతో పట్టు పీతాంబరాలతో అశ్వవాహనంపై అధిరోహించి భక్తులకు సాక్షాత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో నాగేంద్రుడు, పరమేశ్వర ఆలయ అర్చకులు కమిటీ సభ్యులు . చైర్మన్ నరేంద్ర చౌదరి ఎర్రి స్వామి దిలీప్, ఆదిశేషయ్య, వనిత భాయ్, వెంకట రమణమ్మ పాల్గొన్నారు.

# గూడూరులో రన్ ఫర్ జీసస్

**గూడూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
గూడూరు టౌన్, రూరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమము జరిగింది ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం రెండవ పట్టణ పరిధిలో ఉన్న కోర్టు సెంటర్ నుండి బయలుదేరి గాంధీనగర్ వరకు ఏసుక్రీస్తు ప్రభువు మరణము, సమాధి, పునరుద్దానమును గూర్చిన సువార్తను గూడూరు టౌన్ లో ఉన్న పాస్టర్లు అందరూ వేను వీధులలో ప్రకటిస్తూ వెళ్లడం జరిగింది చివరగా ఇందిరమ్మ కాలనీలో ఉన్న జీవముగల దేవుని సంఘము నందు పాస్టర్ దానియేలు రాజు ఆధ్వర్యంలో బ్రేక్ ఫాస్ట్ జరిగింది ఈ కార్యక్రమంలో గూడూరు టౌన్ మరియు రూరల్ వెల్ఫేర్ అసోసియేషన్ దైవ సేవకులు రెవ బక్కా రత్న శేఖర్, వేల్పుల ప్రభుదాసు, కంపా ఇస్సాకు,జయరాజు, కమతం రమేష్,డి. విజయ్ కుమార్, కిషోర్, సుందరం, నాగరాజు, ప్రేమ రాజు, సురేష్, పెంచలయ్య, మరియు లూథరన్ చర్చ్ దైవ సేవకులు ప్రశాంత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.




రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న పాస్టర్లు సంఘ సభ్యులు



కేబుల్ వైర్ కట్ చేసిన దృశ్యం

# రైతుల కేబుల్ వైర్లు చోరీ

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
మండలంలోని టిడి పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ముగ్గురు రైతులకు చెందిన బోరుబావులకు అమర్చిన కేబుల్ వైర్లను చోరీకి గురైనట్లు బాధిత రైతులు వాపోతున్నారు. రమేష్,కు సంబంధించిన బోర్ బావికి అమర్చిన కేబుల్, రాజప్ప అనే రైతుకు చెందిన కేబుల్ వైర్ క్యాతమ్మ అనే రైతులు ముగ్గురు కి చెందిన 45 మీటర్లు చోరీ చేసినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో బోర్ బావులకు అమర్చిన కేబుల్ వైర్లు చోరీ చేయడమే లక్ష్యంగా గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు.దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది.



ఎస్ఐను కలిసిన నాయకులు

# ఎస్ఐను కలిసిన తెదేపా నాయకులు

**గుడిబండ (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప , సింగల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నూతనంగా భాద్యతలు చేపట్టిన ఎస్ ఐ రాజబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజబాబును పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండలం లోని శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజాప్రతినిధులు ఇతర నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ బాలేపల్లి రాజు, జిల్లాఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్ మంజునాథ్ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు నజీర్, నాయకులు భీంరాజు, వెంకటేష్, రాజేంద్ర, సన్నామారప్ప, రామాంజనేయులు, శ్రీరామప్ప, నాగేంద్రప్ప, శంకర్ గౌడ్, సి టి స్వామి, తదితరులు పాల్గొన్నారు.



అంజినప్ప మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించిన యూటీఫ్ నాయకులు

# విశ్రాంత ఉపాధ్యాయులు అంజనప్ప మృతికి ఘన నివాళులు

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
విశ్రాంత ఉపాధ్యాయులు అంజినప్ప మృదుభాషి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం మాజీ నాయకులు వి.ఎన్.అంజినప్ప మృతి పట్ల యూటీఫ్ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.భౌతిక కాయానికి, మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు వ్యక్తిగత సహాయకులు గతంలో మాజీ శాసనమండలి సభ్యుల గుండుమల తిప్పేస్వామి వ్యక్తిగత సహాయకులు అయినా వి. ఏ. రవికుమార్ మడకశిర పట్టణం మారుతి నగర్ లోని స్వగృహంలో అంజనప్ప సార్ గారి భౌతికాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులను అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని యుటిఎఫ్ నాయకులు కే భూతన్న, డి. నరసింహప్ప, పి. సూర్యనారాయణ, వి.ఎన్. మాలింగప్ప, వై. జోగప్ప, టీ. మూడ్ల గిరియప్ప, కదురన్న,ఈ. నరసింహమూర్తి, సి.పి.రవీంద్ర, కే.టి. హనుమంతరాయ, ఓబన్న, నంజప్ప, లక్ష్మణమూర్తి, వై. ప్రభాకర్, దేవరాజు తెలిపారు.

# రేపటి నుంచి ఎస్ఏ-2 పరీక్షలు

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఎస్ఏ -2 పరీక్షలకు ప్రధానోపాధ్యాయులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రశ్నాపత్రాలను క్లస్టర్‌కి అందించే బాధ్యత సిఆర్పిలదేనని ఎంఇఓ శ్రీధర్ సూచించారు. 1-5తరగతులకు ఉదయం. 9:30 నుండి 12:30 వరకు, 6-8 తరగతులు 9:15 నుండి 12:30 వరకు పరీక్షలు ఉంటాయన్నారు. సీఆర్పీల ప్రతిరోజు ప్రశ్నపత్రాలను ఆయా క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించాలన్నారు. మిగిలిన వారుప్రతిరోజు క్లస్టర్ నుండి ప్రశ్నపత్రాలు తీసుకువెళ్లాలని, ప్రశ్నాపత్రాలు సామాజిక మాధ్యమాలలో ఉంచరాదన్నారు.

# 20 రోజుల తరువాత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

**బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
ఎట్టకేలకు 20 రోజుల నిరీక్షణకు తెరపడింది. వినియోగదారులకు శనివారం గ్యాస్ సిలెండర్ల పంపిణీ జరగడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఈనాటి తెలుగోడులో వరుసగా వెలువడిన కథనాలకు స్పందించిన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణంలోని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పంపిణీ ప్రారంభించారు.ఐదు వాహనాల ద్వారా సిలెండర్లు తరలించి, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.30 వరకు పంపిణీ కొనసాగించారు. గత నెల నుంచి ఈ నెల 3వ తేదీ వరకు బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు దాదాపు 565



గ్యాస్ కోసం నమోదు చేసుకుంటున్న వినియోగదారులు



గ్యాస్ సిలిండర్ కోసం బారులు తీరిన వినియోగదారులు

సిలెండర్లు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.గ్యాస్ కోసం ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న వినియోగదారులు ఎండను సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో తరలివచ్చి సిలెండర్లు స్వీకరించారు. బ్రతుకు జీవుడా అంటూ ఉపశమనాన్ని వ్యక్తం చేశారు.అయితే, డెలివరీ బాయ్లు ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొంతమంది డెలివరీ సిబ్బంది మేము ప్రభుత్వ ఉద్యోగులం కాదు, ప్రైవేట్ ఉద్యోగులం అంటూ వాగ్వాదానికి దిగారు. దీనిపై వినియోగదారులు మీరు స్పందించకపోయినా ఏజెన్సీ అయినా సమాచారం ఇవ్వాలి కదా, పంపిణీ ఎప్పుడు ఉంటుందో చెప్పాలి కదా అని నిలదీయగా, డెలివరీ సిబ్బంది అక్కడి నుంచి తప్పించుకున్నారు.







సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్. సమావేశానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

# శ్రీలక్ష్మి పాఠశాలలో ఆధునిక సాంకేతికతతో విద్యాబోధన

## విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం..

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణలో శనివారం పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ విద్యార్థుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, ఆధునిక విద్యా విధానాలు అనుసరిస్తున్నట్లు, విద్య కేవలం మార్కుల కోసం కాకుండా మానవతా విలువలతో పాటు, గుణాత్మకమైన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మాట్లాడారు. మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. తర్వాత జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను బాగా అలరించాయి. సోమవారం నుండి జరుగుతున్న ఎస్, ఎ-2 పరీక్షలకు చక్కగా చదువుకుని మంచి ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు.









సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు గోవిందరావు,శ్రీనివాసరావు

ప్రతిభకు ప్రోత్సాహం ..

# సాంకేతిక, ఆధునిక విద్యతో ఆదర్శంగా పివిఎస్ పాఠశాల

**విద్యా, విజ్ఞానం కలయిక పివిఎస్ ప్రత్యేకత..**
**టాపర్‌కు రూ.10వేలు నగదు బహుమతి..**
**డ్రోన్, 3డి ప్రాజెక్టులతో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన**
**ఆకట్టుకున్న 'రోబోటిక్ డే' గ్రాడ్యుయేషన్ వేడుకలు ..**

**ముదిగుబ్బ (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
ముదిగుబ్బ మండలంలోని పివిఎస్ పాఠశాల విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతూ, విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వినూత్న కార్యక్రమాలతో ముందంజలో నిలుస్తోంది. ఆధునిక సాంకేతికతను విద్యతో మేళవిస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా పాఠశాల తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. 2024--25 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి ఫలితాల్లో రమ్యశ్రీ 589 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలవడం పాఠశాలకు గర్వకారణమైంది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ వెంగమనాయుడు, తన తల్లిదండ్రులు పాలెపు వెంకటసుబ్బయ్య, పాలెపు సువర్ణమ్మల జ్ఞాపకార్థం శనివారం టాపర్‌కు రూ.10,116 నగదు బహుమతిని అందజేసి అభినందించారు. విద్యార్థుల కృషిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత ఉన్నత లక్ష్యాల వైపు దారితీసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.
పాఠశాలలో నిర్వహించిన "రోబోటిక్ డే" కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత రెండు సంవత్సరాలుగా అమలు చేస్తున్న రోబోటిక్స్ విద్యా కార్యక్రమం ఫలితంగా విద్యార్థులు తమ ప్రతిభను వినూత్న ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించారు. డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్ ఆర్మ్, 3డి ప్రింటింగ్, స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ వంటి ఆధునిక ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలు విద్యార్థుల్లో సైన్స్, టెక్నాలజీపై ఆసక్తిని



రోబోటిక్ ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులతో ఎంఈఓ, పాఠశాల సిబ్బంది

పెంచడమే కాకుండా, భవిష్యత్ అవకాశాలకు పునాది వేస్తున్నాయి.
ఇక యూకేజీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కూడా ఎంతో ఉత్సాహంగా జరిగాయి. చిన్నారులు తమ విద్యా ప్రస్థానంలో తొలి మెట్టును పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకోవడం తల్లిదండ్రులకు ఆనందాన్ని కలిగించింది. చిన్నారుల ప్రతిభను ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకకు మరింత ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యా అధికారి రమణప్ప, పాఠశాల నిర్వహణను అభినందిస్తూ, విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధికి ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు మరింత అవసరమని పేర్కొన్నారు. విద్య అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రాయోగిక పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల కరస్పాండెంట్ సుచిత్ర, ప్రిన్సిపాల్ మనీషా, పీఈటి జ్యోతి యాదవ్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. మొత్తానికి, విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, సాంకేతిక విద్యను ప్రోత్సహిస్తూ, సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న పివిఎస్ పాఠశాల ఆదర్శ విద్యాసంస్థగా నిలుస్తోందని చెప్పవచ్చు.

# నేటి నుంచి రత్నగిరి కొల్లాపూరి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు

**మంగళ శుక్రవారాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు ..**
**పర్యాటక కేంద్రంగా రత్నగిరి వైభవం..**

**రొళ్ల (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
చారిత్రాత్మక ప్రదేశంగా పేరుగాంచిన రత్నగిరి గ్రామంలో వెలిసిన శ్రీ కొల్లాప రి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు ఆదివారం (నేటి )నుంచి తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి దొర వంశస్థులు రంగప్పరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది చైత్రమాసంలో కొల్లాపూరి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది ఇందులో భాగంగా 5 న జలది ఉత్సవం,కలశ స్థాపన 6 న బ్రహ్మ రథోత్సవం,7 న జలది, కలశ ఉత్సవం, గంగా పూజ, 8 నుంచి 11 వరకు భక్తులతో అమ్మవారికి జ్యోతులు ఉత్సవాలు 12 న పుష్పాలంకరణ పోతులరాజుతో విశేషపూజ 13 న పోతులరాజు బండార కార్యక్రమం, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందన్నారు. 5 నుంచి 13 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో పశువుల జాతర



కొల్లాపూరి మహాలక్ష్మి అమ్మవారు

కూడా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని అన్ని హంగులతో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు.తొమ్మిది రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొంటారు వారి సౌకర్యార్థం కోసం మడకశిర డిపో అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు, భక్తులు విన్నవించుకొంటున్నారు రత్నగిరి గ్రామం అనంతపురం జిల్లా



భక్తుల కోర్కెలు తీర్చే పాలబావి

కేంద్రానికి 140 కిలోమీటర్లు ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన సత్యసాయి జిల్లాకు 102 కిలోమీటర్లు రోళ్ల కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.ఆలయ సమీపంలో ఉన్న పాల బావిలో గంగ పూజ చేస్తే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందని దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని భక్తుల నమ్మకం అమ్మవారి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుండి కాకుండా కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విద్యుత్ లైన్‌మన్ నాగేశ్వర రెడ్డి

# రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మన్ మృతి

**బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
అనంతపురం--కదిరి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ లైన్‌మన్ మృతి చెందారు. మండలంలోని నెత్తివారంపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి (40) ఓబులాపురం పంచాయతీలో కాంట్రాక్ట్ పద్ధతిలో విద్యుత్ లైన్మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు.శుక్రవారం రాత్రి విధుల్లో భాగంగా రామాపురం నుంచి బత్తలపల్లి సబ్‌స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, గుమ్మలకుంట బస్టాప్ సమీపంలో నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా, నెత్తివారంపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

**లైన్‌మన్ కుటుంబానికి పరామర్శ..**
రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరెడ్డి కుటుంబాన్ని శనివారం ట్రాన్స్‌కో అధికారులు పరామర్శించారు. బత్తలపల్లి సెక్షన్ ఆధ్వర్యంలో రూ.55 వేల ఆర్థిక సహాయం అందజేయగా, ఉమ్మడి అనంతపురం జిల్లా కాంట్రాక్ట్ వర్కర్స్ తరఫున మరో రూ.30 వేల సహాయం అందించారు. అంత్యక్రియలకు ట్రాన్స్‌కో ఏఈ శివయ్యతో పాటు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అలాగే వైఎస్సార్సీపీ మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు దాసరి సూరీ, వెంకటరాముడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయిన విద్యార్థులు

# అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తా

**ముగ్గురు విద్యార్థులకు గాయాలు ఇద్దరి పరిస్థితి విషమం..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
వివాహ కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ముగ్గురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల మేరకు అనంతపురం పట్టణానికి చెందిన కుంటాల అభినయ్, సాత్విక్, వరుణ్ (ఇంటర్ ద్వితీయ సంవత్సరం, నారాయణ కాలేజ్) శనివారం ముదిగుబ్బ మండలం కన్యకల గొందిలో జరిగిన వివాహానికి హాజరై ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణం సాగించారు.ఈ క్రమంలో బత్తలపల్లి మండలం గుమ్మలగుంట వద్దకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొని మోరి క్రిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనం నడిపిన అభినయ్‌కు స్వల్ప గాయాలు కాగా, సాత్విక్, వరుణ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బత్తలపల్లి పోలీసులు తెలిపారు.



శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు

# టీటీడీ బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలి

**వైసీపీ నేతల నిరసన..**
**ఎంపీపీ ఈరన్న మండల కన్వీనర్ త్రిలోక్నాథ్ ..**

**అమరాపురం (తెలుగోడు), ఏప్రిల్ 4 :**
టీటీడీ బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని వైకాపా నేతలు డిమాండ్ చేశారు. అమరాపురంలో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ త్రిలోక్నాథ్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి వైఎస్ఆర్సిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమలలో ఇలాంటి వ్యక్తి పదవిలో కొనసాగే అర్హత లేదని వెంటనే పదవికి రాజీనామా చేసి దిగిపోవాలని నిరసన తెలిపారు.. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకులు జె,కె, మూర్తి, ఆటో తిప్పయ్య, వీర కేతరాయ, పేలుబండ ప్రసాద్, మల్లికార్జున తదితరులు ఉన్నారు



శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు



మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

# విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

### కుటుంబంలో చదువుకున్న మరో విద్యార్థికి ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలి

**కోసిగి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

ప్రమాదవశాత్తు శుక్రవారం నాడు ఆర్టీసీ బస్సు కిందపడి విద్యార్థి మృతి చెందిన ఘటన అత్యంత దురదృష్టకరమని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం మరియు ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మరణించిన విద్యార్థి కంపాటి నరసింహులు ఇంటిని సందర్శించి వారి తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, శ్రీనివాసులు,అన్నయ్యలు రాజు,వీరేంద్ర, గారి కుటుంబాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకత్వ బృందం పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు,ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ మహిళా కన్వీనర్ అఖిల మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి కంపాటి నరసింహులు అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబం పూర్తిగా దయనీయ స్థితిలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని,వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి తక్షణమే రూ10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.అలాగే. బాధిత కుటుంబంలో చదువుకుంటున్న మరొక విద్యార్థికి భవిష్యత్తు భరోసా కల్పిస్తూ,ఆర్టీసీలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యాసంస్థల వద్ద మరియు టర్నింగ్ క్రాసు వద్ద మార్గాన్ని నిర్దేశిస్తూ చూపే బోర్డులు ఏర్పాటు చేయాలని,అలాగే రద్దీ ప్రాంతాలలో బస్సుల వేగాన్ని నియంత్రించి,తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఏఐఎస్ఎఫ్,మండల నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

# విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్

### డీఎస్పీ భార్గవి..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెకానిక్ లెర్నింగ్, డేటా సైన్స్,సైబర్ సెక్యూరిటీ, మెర్న్ ఫుల్ స్టాక్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్ అభిస్తుందని డీఎస్పీ భార్గవి అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్ట్ రోడ్‌లో ఉన్న టెక్‌వేవ్స్ ట్రైబ్ అకాడమీ మొదటి వార్షికోత్సవం సందర్భంగా డీఎస్పీ భార్గవి శనివారం అకాడమీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టెక్‌వేవ్స్ ట్రైబ్ అకాడమీ వారు బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై వంటి నగరాల్లో శిక్షణ అందించే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, వీజు=చీ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై ఎమ్మిగనూరు పట్టణ విద్యార్థులకు శిక్షణ అందిస్తూ, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు.ఈ అవకాశాన్ని ఎమ్మిగనూరు ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమెపిలుపునిచ్చారు. అకాడమీ మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అకాడమీ డైరెక్టర్లు బి. నాగరాజు, ఏ.జగన్లను డీఎస్పీ భార్గవి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి గ్రూప్ చైర్మన్ జీడి లింగప్ప, పట్టణ సీఐ వి. శ్రీనివాసులు, ఎస్సై మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నతుంబలంలో మాజీ సర్పంచ్, వార్డు మెంబర్లకు ఘన సన్మానం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

పెద్దకడుబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామ సర్పంచ్ మాల బసమ్మ, ఉప సర్పంచ్ సంగీత , వార్డు సభ్యుల పదవీ కాలం పూర్తయిన సంగతి తెలిసిందే. అయితే శనివారం చిన్నతుంబళం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్, యువనేత మాల శివ, సాగునీటి సంఘం అధ్యక్షులు నారాయణ, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పదవీ కాలం పూర్తయిన మాజీ సర్పంచ్ బసమ్మ, ఉప సర్పంచ్ సంగీత, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు దివాకర్ రెడ్డి హాజరయ్యారు. మాజీ సర్పంచ్ మాల బసమ్మతో పాటు వైస్ సర్పంచ్ సంగీత, వార్డు సభ్యులు టీ. మంజునాథ్, లలితమ్మ, హరిజన మరియమ్మ,



మాజీ సర్పంచ్ మాల బసమ్మను సన్మానిస్తున్న దృశ్యం



మాజీ ఉప సర్పంచ్ సంగీత, వార్డు సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

తెలుగు రమేష్, చాకలి ఈరమ్మ, మాల శివ, మంగలి నర్సమ్మలను టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు దివాకర్ రెడ్డి, టీడీపీ యువనేత ఇంద్రసేనా రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు వీరేష్ గౌడ్, సిద్ధప్ప గౌడ్, సాగునీటి సంఘం అధ్యక్షులు నారాయణ, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సర్పంచ్, వార్డ్ సభ్యులు తమ పదవీకాలంలో చేసిన సేవలను ప్రశంసించారు. ప్రజల సహకారంతో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశు, గోసులి తిక్కయ్య, హుస్సేనీ, బద్రి, మాల రవి, కోడిగుడ్లు నజీర్, కందనాతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ మాల బసమ్మ, టీడీపీ యువనేత మాల శివను సన్మానించిన టీడీపీ నేత దివాకర్ రెడ్డి



మాజీ సర్పంచ్ రామన్నను సన్మానిస్తున్న దృశ్యం

# నాటక ప్రదర్శన కోసం రూ. 10 వేలు విరాళం

### మాజీ సర్పంచ్ రామన్న..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో శ్రీ భీమరాయ స్వామి రథోత్సవ మహోత్సవాలు ఈ నెల 7, 8 తేదీలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు. రథోత్సవ వేడుకల సందర్భంగా భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించే విధంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి జీవిత చరిత్ర ఆధారంగా నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకంతో పాటు పంచమాంకముల నాటకాన్ని కూడా ప్రదర్శించనున్నారు. ఈ నాటక ప్రదర్శనలకు జాలవాడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రామన్న రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. వీరబ్రహ్మంగారి నాటకానికి రూ.5,000, పంచమాంకముల నాటకానికి రూ.5,000 చొప్పున అందజేసి నాటక కళను ప్రోత్సహించారు. దాత మాజీ సర్పంచ్ రామన్నకు నాటక కళాకారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు బోయ యంకన్న తదితరులు పాల్గొన్నారు.



మైనర్ డ్రైవింగ్‌పై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై రమేష్ రెడ్డి

## పెద్దకడబూరు మండల సమస్యలపై

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నేతలు

### నరవ దంపతుల వినతి పత్రం..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

పెద్దకడబూరు మండలంలోని వివిధ గ్రామాలలో నెలకొన్న ప్రజలు మరియు రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రామకాంతరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ శనివారం కర్నూలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో నెలకొన్న వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి, వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దకడబూరు మండలంలోని పలు గ్రామాలలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే గ్రామీణ రహదారులు దెబ్బతిన్న కారణంగా ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రైతులకు సాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉందని, పంటల సాగు కష్టసాధ్యంగా మారుతోందని చెప్పారు. ఇక ఉపాధి హామీ పనులు కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా పంట నష్టపోయిన రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు నరవ దంపతులు

జిల్లా కలెక్టర్ సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత శాఖాధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను దశలవారీగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ యంత్రాంగం మరింత చురుకుగా వ్యవహరించాలని టీడీపీ నాయకులు కోరారు.

# మైనర్ డ్రైవింగ్‌పై కోసిగి పోలీసుల ప్రత్యేక డ్రైవ్

### తల్లిదండ్రులకు కౌన్సెలింగ్, జరిమానా విధింపు.. ఎస్సై రమేష్ రెడ్డి..

**కోసిగి (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

కోసిగి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడిందని ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా రోడ్లపై పర్యవేక్షణ చేసి మోటార్ సైకిళ్లు నడుపుతున్న మైనర్లను గుర్తించి, వారిని ఆపి వాహనాలను సీజ్ చేసి, సంబంధిత మైనర్ల తల్లిదండ్రులకు మైనర్ డ్రైవింగ్ చట్టపరంగా నేరమని, ఇటువంటి చర్యల వల్ల పిల్లల ప్రాణాలకు ప్రమాదం కలగడమే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదం కలిగే అవకాశం ఉందని వివరంగా కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించామన్నారు. మోటార్ వాహన చట్టం ప్రకారం అవసరమైన జరిమానాలు విధించడం జరిగిందని రమేష్ రెడ్డి తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈ డ్రైవ్ కొనసాగించబడుతుందన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల యాజమాన్యం సయ్యద్ దూద్ బాష

# విద్యతోపాటు విజ్ఞానరంగంలో రాణించాలి

### ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 23వ వార్షికోత్సవ వేడుకలు .. ఎంఈఓ రామాంజనేయులు.. కౌతాళం సిఐ అశోక్ కుమార్..

**కౌతాళం (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

విద్యార్థులు విద్యతోపాటు విజ్ఞాన రంగంలోనూ రాణించాలని మండల విద్యాశాఖ అధికారి రామాంజనేయులు, కౌతాళం సిఐ అశోక్ కుమార్ అన్నారు. కౌతాళం మండల కేంద్రంలోని ప్రతిభా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 23వ వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, పాఠశాల యాజమాన్యం సయ్యద్ దూద్ బాష, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రెటరీ సయ్యద్ మైనుద్దీన్ తదితరులు ముందుగా సరస్వతీ దేవి, నటరాజ స్వామి పటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు అనంతరం విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రు ఉద్దేశించి ఎంఈఓ, సిఐ మాట్లాడుతూ ప్రస్తుత సమాజం విజ్ఞాన రంగంలో దూసుకెళుతుందని, పిల్లలను చదువుతోపాటు విజ్ఞాన రంగంలో పోటీపడి విధంగా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థినీ విద్యార్థులు సెల్‌ఫోన్ల ద్వారా, చెడు స్నేహాల ద్వారా, దూర అల్వాట్లకు బానిసలు అవుతున్నారని మంచి బంగారు భవిష్యత్తు ఉండవలసిన విద్యార్థులు అర్ధాంతరంగా జీవితాలను చేసుకుంటున్నారని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు . విద్యార్థులు క్రమశిక్షణ, వినయ, విధేయతలు కలిగి ఉంటేనే విద్యతోపాటు ఏ రంగంలోనైతే నేమి గొప్పగా రాణించగలరని సూచించారు . తల్లిదండ్రుల కష్టాన్ని, వారి బాధను గుర్తించి విద్యార్థులు కష్టపడి బాగా చదివినప్పుడే తల్లిదండ్రుల కలలను సాకారం చేయగలరన్నారు. దానితోపాటు మీ భవిష్యత్తు కూడా ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని మారుమూల మండలంగా ఉన్న కౌతాళంలో చక్కటి వసతులతో ఉన్నత విద్యను అందించే పాఠశాల ఉండడం మనందరి అదృష్టమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నతంగా ఉండాలని ఫీజులు కట్టి మరీ చదివిస్తున్నారన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యా విజ్ఞాన రంగంలో రాణించాలన్నారు.

ఈ విద్యా సంవత్సరం నుంచి “లీడ్ ”సంస్థ ద్వారా ఒకటి నుంచి 5వ తరగతి వరకు డిజిటల్ క్లాసులను ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. . ఐఐటీ, అబాకాస్, సైన్స్, గణితంలో చిన్నారులు చేసిన ప్రాజెక్టులకు జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సలహాదారులు లక్ష్మణ చారి, ఆర్గనైజర్ ఖాజా హుస్సేన్, డిజిటలైజేషన్ లీడ్ సంస్థ మేనేజర్ నాగార్జున నాయక్, ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం ఉప ప్రధానార్చకులు మహాదేవ స్వామి, మండల ఆర్ఎంపి డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు రాజానందు, ఎక్స్ ఆర్మీ ముద్దయ్య స్వామి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు




వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

# ఘనంగా క్రీడా, సాంస్కృతిక వారోత్సవాలు

### కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అకట్టుకున్న సాంస్కృతిక కార్యకమాలు.. టిడిపి టౌన్ అధ్యక్షులు డాక్టర్ నీలి రాజనంద్ .. స్కూల్ కమిటీ చైర్మన్ బసవరాజు..

**కౌతాళం (తెలుగోడు), ఏప్రిల్ 4 :**

కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీడా సంస్కృతిక వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కౌతాళం సొసైటీ చైర్మన్ అల్లూరి వెంకటపతి రాజు, టిడిపి కౌతాళం టౌన్ అధ్యక్షులు




విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

డాక్టర్ నీలి రాజనంద్ , కౌతాళం స్కూల్ కమిటీ చైర్మన్ బసవరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు తమ శారీరక దృఢత్వం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సమగ్ర అభివృద్ధిని పెంపొందించేందుకు నిర్వహించె ఒక అద్భుతమైన కార్యక్రమం అన్నారు. జిల్లా,రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను ప్రదర్శించడానికి వారిని ప్రోత్సహిస్తాయన్నారు. తద్వారా వారిలో ఆరోగ్యకరమైన. పోటీ తత్వం పెరుగుతుందన్నారు. సాంస్కృతిక, క్రీడా విజేతలకు మెమెంటోలు, బహుమతులు ప్రధానం చేశారు. అతిధులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు.




వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

# 10న విడుదలవుతున్న డెకాయిట్




అడివి శేష్ హీరోగా రానున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' షానీల్ డియో దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించారు. ఏప్రిల్ 10న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక ప్రత్యేక బ్రాండ్‌ను క్రియేట్ చేసుకున్న హీరో అడివి శేష్. తన తదుపరి చిత్రం 'డెకాయిట్' తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. మృణాల్ ఠాకూర్‌తో ఆయన కెమిస్ట్రీ ఈ సినిమాకు మెయిన్ హైలైట్ కానుంది. ఈ చిత్రంతో ఏప్రిల్ 10న విడుదల కాబోతున్న తరుణంలో శేష్ వరుస ప్రమోషన్స్ లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణంలోని కీలక విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా తన సినిమాలను నమ్మి పెట్టుబడి పెట్టిన నిర్మాతలకు ఇప్పటివరకు నష్టాలు రాలేదని ఆయన గర్వంగా చెప్పుకొచ్చారు. 'ఇప్పటివరకు నాతో పని చేసిన ప్రొడ్యూసర్స్ అందరూ లాభాలు గడించారు. వాళ్ళు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని నేను నమ్ముతున్నాను' అని శేష్ పేర్కొన్నారు. కేవలం నటుడిగానే కాకుండా, స్క్రిప్ట్ విషయంలో కూడా శేష్ తీసుకునే జాగ్రత్తలే ఆయన సినిమాల మినిమమ్ గ్యారెంటీ సక్సెస్‌కు కారణమని ఇండస్ట్రీ టాక్. అలాగే తన కెరీర్‌లో మర్చిపోలేని సినిమా గురించి ప్రస్తావిస్తూ.. గూఢచారి నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ సినిమా ఇచ్చిన సక్సెస్ వల్లే ఈరోజు నేను ఇలాంటి భారీ ప్రాజెక్టులు చేయగలుగుతున్నాను' అని ఎమోషనల్ అయ్యారు. ఆ సినిమాతో వచ్చిన గుర్తింపు శేష్‌ను కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో ఒక నమ్మకమైన హీరోగా నిలబెట్టిందన్నారు.

# ఈ వేసవికీ రానట్టేనేమో..!



ప్రభాస్ కథానాయకుడిగా ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా డైరెక్టర్ నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న 'రామాయణ్' టీజర్‌పై దివంగత నటుడు దారసింగ్ కుమారుడు, నటుడు విందు దారసింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల విడుదలైన రామ టీజర్‌లో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి లుక్ అద్భుతంగా ఉందంటూ ప్రశంసించిన ఆయన.. అదే సమయంలో మేకర్స్‌కు ఒక సున్నితమైన హెచ్చరిక చేశాడు. రామాయణం వంటి పవిత్ర కావ్యాన్ని తెరకెక్కించేటప్పుడు మూల కథ నుంచి ఏమాత్రం పక్కకు జరిగినా ప్రేక్షకులు అస్సలు ఒప్పుకోరని ఆయన స్పష్టం చేశాడు. దిగ్గజ నటుడు దారసింగ్.. గతంలో రామానంద్ సాగర్ రూపొందించిన 'రామాయణ్' సీరియల్‌లో హనుమంతుడి పాత్రలో జీవించి ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. ఆ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న విందు మాట్లాడుతూ.. రామాయణ్ టీజర్ చాలా అద్భుతంగా, ఎంతో అందంగా ఉంది. అయితే ఇక్కడ ఒక కఠినమైన నియమం ఉంది. రామానంద్ సాగర్ గారు తీసిన రామాయణం మనందరి హృదయాల్లో, మనస్సుల్లో బలంగా నాటుకుపోయింది. అది ఒక చరిత్ర, ఎప్పటికీ నెంబర్ వన్. ఇప్పుడు రాబోతున్న సినిమా ఆ స్థాయిని అందుకుంటే మాత్రం రికార్డులను తిరగరాసే సూపర్ హిట్ అవుతుంది. కానీ కథలో అనవసర మార్పులు చేసినా, పాత్రలను మరీ భయంకరంగా అసురుల తరహాలో చూపించినా జనాలు అస్సలు అంగీకరించరు అని విందు పేర్కొన్నాడు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు నేను చూసిన దాన్ని బట్టి తివారీ గారి 'రామాయణ్' చాలా మెరుగ్గా కనిపిస్తోంది. అసలు ఆదిపురుష్‌లో ఏం చూపించారో నాకే అర్థం కాలేదు. ఆ ట్రైలర్ చూసినప్పుడే ఆ సినిమా ఫ్లాప్ అవుతుందని నాకు అర్థమైపోయిందన్నారు.

# ఎల్లమ్మ కథకు దేవిశ్రీ అయితేనే సరిపోతాడు

'బలగం' సినిమాతో ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'తో మరోసారి భారీ అంచనాలను సృష్టిస్తున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే ఇండస్ట్రీలో హాట్ టాపిక్ నడుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నాని, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్ వంటి స్టార్స్ నటిస్తారని గతంలో ప్రచారం జరిగింది. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, దర్శకుడు వేణు ఈ పాత్ర కోసం దేవి శ్రీ ప్రసాద్‌ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా సంగీత దర్శకుడిగా గుర్తింపు పొందిన దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా కొత్త ప్రయాణం ప్రారంభించ బోతున్నారు. ఇది ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంపై వస్తున్న సందేహాలకు దర్శకుడు వేణు క్లారిటీ ఇచ్చారు. సినిమాలో తీసుకునే ప్రతి నిర్ణయం కథకు అనుగుణంగానే ఉంటుంది. 'ఎల్లమ్మ' కథకు ఒక ప్రత్యేకమైన బాడీ లాంగ్వేజ్ ఉన్న వ్యక్తి కావాలి. మొదట వేరే నటులను అనుకున్నా? కథ మారుతూ ఉండటంతో దేవి శ్రీ ప్రసాద్ అయితేనే సరిపోతారని భావించాం అని తెలిపారు. కథలోని సహజత్వం , భావోద్వేగాలను ప్రేక్షకులకు బలంగా చేరవేయడానికి దేవి సరైన ఎంపికగా కనిపించారని ఆయన వివరించారు. బలగంతో గ్రామీణ భావోద్వేగాలను అద్భుతంగా చూపించిన వేణు? 'ఎల్లమ్మ'లో కూడా అదే మట్టి వాసనను తెరపై ఆవిష్కరించబోతున్నారు. ఈ సినిమా కూడా ఎమోషనల్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం. సంగీత దర్శకుడిగా ఎనలేని క్రేజ్ సంపాదించిన దేవి శ్రీ ప్రసాద్‌ని నటుడిగా ఎలా చూపిస్తారు? ఆయన పాత్రలో ఎంతవరకు ఒదిగిపోతారు? అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. టాలీవుడ్‌లో కొత్త ప్రయోగాలలు ఎప్పుడు అందరిలో ఆసక్తిని కలిగిస్తుంటాయనే విషయం మనకు తెలిసిందే. ఈ క్రమంలో వేణు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. .



# రాముడు, పరశురాముడు..రెండూ రణ్‌బీర్



ప్రకటించిన నాటినుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 'రామాయణ'. ఇటీవల దీని టీజర్ విడుదలై మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి రణ్‌బీర్ ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేసినట్లు తెలిపారు. ఇందులో రణ్‌బీర్ శ్రీరాముడితో పాటు పరశురాముడి పాత్రను కూడా పోషిస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. 'శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం పరశురాముడు. ఈ సినిమాలో శ్రీరాముడితో పాటు పరశురాముడిగా కూడా నటించే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నా. ఇలాంటి సినిమాల్లో నటించేటప్పుడు బాడీ లాంగ్వేజ్ మాత్రమే కాదు.. ఆ పాత్రల వెనక ఉన్న ఆధ్యాత్మికతను, భావోద్వేగాలను లోతుగా అర్థం చేసుకోవడం ముఖ్యం. 'రామాయణ' చిత్రీకరణకు ముందు ఏడాది పాటు ఆ పాత్రల గురించి బాగా తెలుసుకున్నానని రణ్‌బీర్ తెలిపారు.ప్రస్తుతం 'రామాయణ'కు సంబంధించిన మరో వార్త కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమా కోసం ఓ ఓటీటీ సంస్థ భారీ డీల్‌కు ముందుకు వచ్చిందిట. కానీ, నిర్మాత నమిత్ మల్హోత్రా ఆ డీల్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. రెండు భాగాలకు కలిపి ఓటీటీ సంస్థ రూ.1000 కోట్లకు అడగ్గా.. ఆయన దాన్ని తిరస్కరించారట. ఈ డిజిటల్ హక్కుల విషయంలో ఆయన 'ధురంధర్' చిత్రబృందం వ్యూహాన్ని అనుసరించాలని చూస్తున్నట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. మొదట పార్ట్ వన్‌తో డీల్ కుదుర్చుకుని అది విడుదలైన తర్వాత దానికి వచ్చిన స్పందనను బట్టి రెండో భాగానికి ఒప్పందం కుదుర్చుకోవచ్చని నిర్మాత భావిస్తున్నట్లు సమాచారం. రూ.4000 కోట్లతో అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ ప్రాజెక్ట్ రానుంది. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం దాని వీఎఫ్ఎక్స్
పనులు జరుగుతున్నాయి. రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ ఈ ఏడాది దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి. తాజాగా ఈ సినిమా రన్‌టైంకి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఇటీవల అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో హాలీవుడ్ మీడియాతో 'రామాయణ్' సినిమా విశేషాలను పంచుకుంటున్న సమయంలో.. రణ్‌బీర్ కపూర్ అతడికి తెలియకుండానే సినిమా రన్‌టైం గురించి నోరు జారడు. ఈ సినిమా గురించి రణ్‌బీర్ మాట్లాడుతూ.. దాదాపు 6 గంటల ఎపిక్ విజువల్స్‌తో ఈ సినిమా రాబోతుంది. రామాయణం అనేది ఒక మహా కావ్యం. దీనిని ఏమాత్రం కుదించకుండా, ప్రతి కీలక ఘట్టాన్ని అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించేందుకే మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని రణ్‌బీర్ తెలిపాడు.

# ధురంధర్ -2 నుంచి 'జైయే సజనా'

బాలీవుడ్ స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' నుంచి 'జైయే సజనా' ఫుల్ వీడియో సాంగ్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. సినిమాలో రెహమాన్ డెకాయిట్ మరణానంతరం వచ్చే ఈ ఎమోషనల్ సాంగ్.. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా విపరీతంగా ట్రెండ్ అవుతోంది. ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత శాశ్వత్ సచ్‌దేవ్ అద్భుతమైన సంగీతాన్ని అందించగా.. పంజాబీ పాప్ సింగర్ జాస్మిన్ శాండ్లాస్, ప్రముఖ సూఫీ గాయకుడు సతీందర్ సర్తాజ్ కలిసి ఈ పాటను ఎంతో హృద్యంగా ఆలపించారు. ముఖ్యంగా ఈ పాటలో సతీందర్ సర్తాజ్ పాడిన 'సాను సరియాన్ విసర్ గైయాన్ రహ్వాన్, వే కెహ్డే పాసే జైయే సజ్జనా' అనే పంజాబీ లిరిక్స్ ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఈ పాట యూట్యూబ్‌లో తాజాగా టాప్ 2 ట్రెండింగ్‌లో ఉంది.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu… EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.